క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ కాసులమ్మ

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెంలో ప్రకృతి వ్యవసాయం, సాగు విధానాలపై రైతులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ ఎం.కాసులమ్మ.. రైతులను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి మరీ ప్రకృతి సేద్యం లాభాలు, ఏయే పంటలను ఏ విధంగా పండిస్తే అధిక దిగబడులు వస్తాయన్న అంశాలపై అవగాహన కల్పించారు.

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు



బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ మూర్తి

గంట్యాడ: మండలంలోని మురపాక వద్ద ఉన్న సూర్యరాజ్ రైస్‌మిల్లుతో పాటు రావివలస వద్ద ఉన్న కనకదుర్గ రైస్‌మిల్లులో సీఎస్‌డీటీ మూర్తి గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మిల్లుల్లోని బియ్యం నిల్వలను చూసి, రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉందా లేదా అని పరిశీలించారు.

విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలి

వేపాడ: చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని ఎంఈవోలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని శింగరాయి, జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలలను వారు గురువారం సందర్శించారు. తొలుత తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లిన వారు పుస్తకాలు చదివించి, వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి పెట్టాలన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత



ట్రైసైకిల్ అందజేస్తున్న ఎన్‌ఐఎల్‌డీ ప్రతినిధులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్‌ఐఎల్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకోమెటర్ డిజాబిలిటీస్), కోల్‌కతా వారి సహకారంతో 25 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు గురువారం అందజేశారు. అలాగే మరికొంత మంది దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చెవిటి మెషీన్లు, వాకర్స్ అందజేశారు.

ప్రహరీ లేక ఇబ్బందులు

మెరకముడిదాం: మండలంలోని ఎం.గదబవలస ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.పాఠశాల పంట పొలాల మధ్యలో ఉండడంతో విష సర్పాలు, కీటకాలు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కొంతమంది తమ ఇంటి సామగ్రిని పాఠశాల ఆవరణలో వేస్తున్నారని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

శృంగవరపుకోటలో అగ్నిప్రమాదం

శృంగవరపుకోట: స్థానిక దేవి జంక్షన్‌లో ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చేసుకున్న పుట్టినరోజు వేడుకలు అగ్నిప్రమాదానికి దారితీశాయి. బర్త్ డే సందర్భంగా కాల్చిన తారాజువ్వలు ఎగిరిపడి చింతబడి వీధిలోని పూల వ్యాపారి ధనాల శంకరరావు నివాసముంటున్న తాటాకుల ఇంటిపై పడ్డాయి. ఈ క్రమంలో ఆ ఇల్లు అంతా కాలి బూడిదైంది. అదృష్టవశాత్తు ఆ ఇంటి యజమానికి ఏం ప్రమాదం జరగలేదు. ఇంట్లో బంగారం, బీరువా, బట్టలు ఇతర ఫర్నిచర్ అంతా పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులో 'స్టెమి'

చీపురుపల్లి: గుండెపోటు వచ్చిన వారికి అత్యవసరంగా అందించే అత్యంత ఖరీదైన ఇంజిక్షన్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉందని జనరల్ ఫిజీషియన్ కుమార్ తెలిపారు. అత్యవసర సమయాల్లో గుండెపోటుతో వచ్చే వారికి అందించే స్టెమి ఇంజిక్షన్‌పై స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వారిని గంట వ్యవధిలో ఏరియా ఆస్పత్రికి తీసుకువస్తే తక్షణమే స్టెమీ ఇంజిక్షన్ అందిస్తామన్నారు. దీని ఖరీదు సుమారు 45 వేల రూపాయలు ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు!

- లాభదాయకంగా ప్రకృతి సేద్యం
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- సాగుకు ఆసక్తి కనబరుస్తున్న రైతులు



జీవామృతం తయారీ, ప్రయోజనాలను వివరిస్తున్న రీజనల్ ప్రకృతి వ్యవసాయం అధికారి హేమసుందర్



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు(ఫైల్)

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుండడంతో ప్రకృతి సేద్యానికి అన్నదాతలు ముందుకు వస్తున్నారు. దీంతో ఏటా ప్రకృతి సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. సాధారణంగా పొలాల్లో పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం కోల్పోవడం జరుగుతోంది. ఈ క్రమంలో పంటల దిగుబడి ఆశించినంతగా రావడం లేదు. అదే ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల దిగుబడి, ఆరోగ్యవంతమైన ఫలసాయం అధికంగా వస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉండడంతో ప్రకృతి సాగు అవలంబించేందుకే రైతులు ఆసక్తి కనబరుస్తుండడం విశేషం. ఇదిలా ఉంటే ప్రకృతి సాగుకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆ దిశగా ప్రోత్సాహక చర్యలేవీ కనబడకపోవడంతో రైతులంతా ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే బాగుంటుందని కోరుకుంటున్నారు.

మండలంలో 2,200 ఎకరాల్లో..

గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలో బొండపల్లి, మెంటాడ మండలాలను ప్రకృతి సేద్యానికి ఎంపిక చేశారు. అక్కడి రైతులను ప్రకృతి సాగు విధానాల ద్వారా వ్యవసాయానికి ప్రోత్సహించడం జరుగుతోంది. దీంతో ప్రకృతి సేద్యానికి ముందుకు వచ్చిన రైతులకు సాగులో మెలకువలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నేర్పిస్తున్నారు. ఒక్క బొండపల్లి మండలంలో మొత్తం 10 క్లస్టర్లు ఉండగా, వాటిలో 2,200 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పండిస్తున్నారు.

భూసారం కాపాడే ఎరువులు..

ప్రకృతి వ్యవసాయంలో భూసారం కాపాడే ఎరువుల వినియోగం జరుగుతుంది. ప్రకృతిలో సహజంగా లభించే ఆకులు, ఆవుపేడ, మూత్రం వంటి వాటితో కషాయాలు, ద్రావణాలు తయారు చేస్తారు. వీటిని పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్లు, వ్యాధులు సోకవు. ప్రకృతి సేద్యంలో ఎరువుల తయారీకి అయ్యే ఖర్చు తక్కువే.. తయారీ సులభమే కావడంతో రైతులు ఎక్కువగా ఈ రకమైన వ్యవసాయం చేసేందుకు ఉత్సుకత కనబరుస్తున్నారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం..

ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఇప్పుడిప్పుడే చాలా మంది రైతులు ప్రకృతి సేద్యానికి మరలుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రకృతి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవసాయంతో రైతులకు అన్నివిధాలా మేలే తప్ప కీడు లేదు.

–కె.హేమసుందర్,
ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి

సబ్సిడీపై పరికరాలు, విత్తనాలు ఇవ్వాలి..



ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. సాగుకు అవసరమైన పరికరాలు, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందివ్వాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. రైతులు కూడా క్రమక్రమంగా ప్రకృతి సేద్యానికి ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేస్తే మరిన్ని సత్ఫలితాలు ఉంటాయి.

–మహంతి రమణ,
పీఏసీఎస్ మాజీ చైర్మన్, గొట్లాం గ్రామం

రైల్వే లైన్ పనుల అడ్డగింత



దత్తిరాజేరు మండలం, పెదమానాపురం గ్రామస్తులు రైల్వే లైన్ పనులను గురువారం అడ్డుకున్నారు. నిర్మాణానికి చేపట్టిన స్థలసేకరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటిస్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, బాధితులకు నష్ట పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పట్లో ఇక్కడ మూడో రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం ఇళ్ల కొలతలు సరిగా వేయకుండా స్థలం సేకరించారని, దీంతో దాదాపు 40 కుటుంబాల వారికి రూ.3 లక్షలు, రూ.4 లక్షలు, రూ.5 లక్షలు చొప్పున పరిహారం తక్కువగా అందిందన్నారు. ఇదే విషయమై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరిస్తే గానీ పనులు జరగనివ్వమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి సైతం ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాములు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.దాసు తదితరులు పాల్గొన్నారు.–దత్తిరాజేరు

జీవో నంబరు 3 జారీ దుర్మార్గం



కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ఏపీ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావువిమర్శించారు. ఇదే విషయమై ఆయన కొత్తవలస పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో బొబ్బిలి బహిరంగ సభలో ప్రస్తుత సీఎం చంద్రబాబు.. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా చూస్తానని, మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయలేమని చెబుతూ జీవో నంబరు 3 జారీ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.40 లక్షల మంది అవుట్‌సోర్సిగ్, 60 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని, వారికి ఇచ్చిన మాట ప్రకారం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

–కొత్తవలస

కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా నిరసన



కేంద్ర కార్మిక చట్టాలకు వ్యతిరేకిస్తూ శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటు వద్ద సీఐటీయూ(సెంటర్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్) నాయకులు గురువారం నిరసన చేపట్టారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నేడు మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేసే నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి, తీసుకువచ్చిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రం స్పందించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ ముత్యాలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. –శృంగవరపుకోట

లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలి

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



బోడసింగిపేటలోని గ్యాస్ ఏజెన్సీలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

బొండపల్లి: లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సూచించారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని బోడసింగిపేట గ్రామంలో గల శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌తో పాటు, కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం దీపం పథకం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఎంత మంది లబ్ధిదారులకు ఇచ్చారు? దీపం కనెక్షన్ ఉన్న వారంతా ఉచిత గ్యాస్‌ను పొందుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు? వారందరికీ గ్యాస్ సబ్సిడీ వారి అకౌంట్‌లలో పడుతుందా? అని నేరుగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు ఏ విధంగా సరుకులు పంపిణీ చేస్తున్నారో తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చుడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోలా రాజేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'సంకల్పం'



సంకల్పం పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్సై దామోధరరావు, విద్యార్థులు

చీపురుపల్లి: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉంటామంటూ 'సంకల్పం' తీసుకోవాలని ఎస్సై ఎల్.దామోదరరావు పిలుపునిచ్చారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సిద్ధం చేసిన 'సంకల్పం' ప్రచారరథం ద్వారా గురువారం స్థానిక శ్రీనివాసా జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్‌కు వ్యతిరేకంగా ప్రచార రథంలో లఘు చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటూ.. మిగిలిన వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం సంకల్పం పోస్టర్లు విడుదల చేశారు.

వైఎస్సార్ సీపీ అధినేతను కలిసిన నాయకులు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పూలబొకే అందజేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, జెడ్పీటీసీ తవుడు

గజపతినగరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు తాడేపల్లిగూడెంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు మాట్లాడుకుంటున్న విషయాలను వారు వివరించారు.

మా పొట్ట కొట్టొద్దు...



ట్రాన్స్‌కో అధికారులకు తమ గోడు వెల్లబోసుకుంటున్న తొలగించబడిన షిఫ్ట్ ఆపరేటర్లు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఎన్నో ఏళ్లుగా ఈ కేంద్రాన్నే నమ్ముకుని చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. ఈ చిన్నపాటి ఉద్యోగమే మాకు జీవనాధారం. ఈ ఉద్యోగం నుంచి మమ్మల్ని తొలగించి మా పొట్ట కొట్టొద్దంటూ కోడూరు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఏపీ ట్రాన్స్‌కో అధికారుల ఎదుట గురువారం మొర పెట్టుకున్నారు. గరివిడి మండలం కోడూరు పరిధిలో ఉన్న సబ్‌స్టేషన్‌లో కోడూరు, తోండ్రంగి, డీఎఫ్ఎన్, పెనుబర్తి గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు షిఫ్ట్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా వీరిని తొలగించి, ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో కొత్తగా వేరే వారిని షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించారు. కొత్తగా నియామకమైన వారు గురువారం విధుల్లో చేరగా.. ఉద్యోగాలు కోల్పోయిన వారు కుటుంబ సభ్యులతో సహా సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కోడూరు మాజీ సర్పంచ్ గేదెల ఆదినారాయణ, ఉప సర్పంచ్ గేదెల శంకరరావు, తోండ్రంగి మాజీ సర్పంచ్ పిల్ల అప్పలనాయుడు, తదితరులు ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాల వారికి అండగా నిలబడ్డారు. అయితే తమ చేతుల్లో ఏమీ లేదని ట్రాన్స్‌కో అధికారులు చేతులెత్తేశారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రస్తుతం కురుస్తున్న మంచు వల్ల మామిడికి కలిగే నష్టాన్ని నివారించడంతో పాటు పురుగులు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టడానికి రైతులు సస్యరక్షణ చేపట్టాలని ఉద్యానవనశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో మామిడిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు గురువారం శిక్షణ సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడిలో బంగినపల్లి, సువర్ణరేఖ రకాలు తెల్లపూత దశ నుంచి ఆవగింజ సైజుకు చేరుకున్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న మంచు వల్ల పూత, పిందెలు మాడిపోయే అవకాశం ఉందన్నారు. పూత, పిందెను కాపాడుకునేందుకు 3000 లీటర్ల నీటిలో (ట్రాక్టర్ ట్యాంక్) 1.5 కిలోలల థియోమితాక్సామ్, 1.5 కిలోల మైక్లోబ్యూటానిల్, 750 ఎం.ఎల్ ప్లానోఫిక్స్‌తో పాటు 0.0.52.34 ఎరువు 1.5 కిలోలు కలుపుకుని పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా గింజపూతలో ఉన్న తోటలకు థియోమితాక్సామ్ 1.5 కిలోలు, ఇమామెక్టిన్ బెంజోమేట్ లీటర్, జినెబ్ 6 కిలోలు ట్రాక్టర్ ట్యాంక్‌లో కలుపుకుని పిచకారీ చేయాలని తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

- ఎంపీడీఓ భాస్కరరావు



యాడికలో వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెరకముడిదాం: కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీఓ జి. భాస్కరరావు అన్నారు. మండలంలోని యాడిక, గరుగుబిల్లి, గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. వేతనదారులకు చెందిన మస్టర్లను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. ఒకరి జాబ్‌కార్డుతో మరొకరు పనిలోకి రాకూడదని సూచించారు. రెండు పూటలా పనులు చేపడితే రోజుకు 272 రూపాయల వేతనం వస్తుందని చెప్పారు. అలాగే పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్‌లను కచ్చితంగా ఉంచాలని ఉపాధి క్షేత్ర సహాయకులకు సూచించారు.

సంక్షిప్తంగా...

అవగాహనతోనే క్షయవ్యాధి నియంత్రణ

కొత్తవలస: అవగాహనతోనే క్షయవ్యాధి నియంత్రణ అని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని రామలింగాపురంలో క్షయవ్యాధి నియంత్రణపై గురువారం అవగాహన కల్పించారు. రెండు వారాలు మించి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, జ్వరం, గుండెలో నొప్పి వంటి లక్షణాలు క్షయవ్యాధి లక్షణాలు అని తెలిపారు. 60 ఏళ్ల వయసు పైబడిన వారు, మధుమేహం నియంత్రణలో లేకపోవడం, మద్యం సేవించడం, పౌష్టికాహార లోపం, ధూమపానం వంటి వాటి కారణంగా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామస్తులతో వ్యాధి నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు.

వితరణ

లక్కవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ భాషోపాధ్యాయుడు అదే పాఠశాల విద్యార్థుల కోసం ఆరు టేబుల్ టెన్నిస్ రాకెట్లు గురువారం వితరణ చేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఇక్కడి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తుండడంతో వారిని మరింత ప్రోత్సహించేందుకు తన వంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు.

9న ఎడ్లపరుగు పోటీలు

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేటలో వివేకానందస్వాముల తీర్థ మహోత్సవాలు ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 9వ తేదీ మధ్యాహ్నం కబడ్డీ పోటీలు, అదేరోజు సాయంత్రం ఎడ్లపరుగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు చొప్పున అందిస్తామని, ఎడ్లపరుగు పోటీల్లో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.20 వేలు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు రూ.6 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతి అందిస్తామన్నారు.

10న నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

వేపాడ: మండల వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన డీవార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత విద్యార్థులతో మాత్రలు వేయించాలన్నారు. 19 ఏళ్ల వయసులోపు ఉన్న వారందరితోనూ ఈ మాత్రలు మింగించాలన్నారు.

రైల్వే డివిజన్ ఏర్పాటుపై హర్షం

వేపాడ: విశాఖ కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటుకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడంపై బీజేపీ విశాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోకేడ మహేష్, బీజేపీ మండల అధ్యక్షుడు లట్టాల పవన్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం హర్షం వ్యక్తం చేశారు. సౌత్ కోస్టల్ జోన్ పరిధిని నిర్ణయించి, విశాఖ కేంద్రంగా డివిజన్ ప్రకటన చేయడం జరిగిందన్నారు. సౌత్ కోస్టల్ జోన్‌ను 410 కిలోమీటర్లుగా రైల్వేశాఖ ఖరారు చేసిందన్నారు.

ఆరోగ్య తనిఖీలు

కొత్తవలస: మండలంలోని దత్తి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. అప్పన్నపాలెం వద్ద ఉన్న జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి హాజరైన వారికి వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

పక్కాగా ఎన్నికల నిబంధనలు

మెరకముడిదాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్నాయని, దీనికి సంబంధించి ఎన్నికల నిబంధనలను అందరూ కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ అజూ రఫీజాన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే మండలంలో అన్ని పార్టీల నాయకులు, ఉపాధ్యాయులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాలను జారీ చేయడం జరిగిందన్నారు.

నిర్బంధం సరికాదు

వేపాడ: తెలంగాణలో వీఆర్‌ఏ కుటుంబాల సభ్యులను ప్రభుత్వం నిర్బంధించడం సరికాదని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఖండించింది. గతంలో 81, 87 జీవోల ద్వారా 60 ఏళ్ల వయసులోపు ఉన్న 16,700 మంది వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. మిగిలిన 61 ఏళ్ల వయసు దాటిన 3,700 మంది వీఆర్‌ఏల వారసులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ప్రభుత్వం చెప్పిందని, అయితే ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. అనాడు ఇచ్చిన హామీనే ఇప్పుడు నెరవేర్చమని అడిగితే ప్రభుత్వం సదరు వీఆర్‌ఏల వారసులను నిర్బంధం చేయడం తగదన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గజపతినగరం: మొక్కజొన్న సాగు చేసే రైతులంతా యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు సూచించారు. మండలంలోని శ్రీరంగరాజపురం, ఎం.వెంకటాపురం గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ఆయన గురువారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. పంటలు సాగు చేసే సమయంలో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడుల సాధనకు వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు.